క్లుప్తంగా

చిన్నతనం నుంచే మంచి అలవాట్లు నేర్పించాలి



ప్రశంస పత్రాలు అందుకున్న సత్‌జ్ఞాన్ హైస్కూల్ విద్యార్థులు

కుత్బుల్లాపూర్: పిల్లలకు చిన్నతనం నుంచిమంచి అలవాట్లు నేర్పిస్తే భవిష్యత్‌తో ఉన్నత స్థితికి చేరుకుని సమాజాభివృద్ధికి పాటు పడతారని సత్‌జ్ఞాన్ హైస్కూల్ కరస్పాండెంట్ చింతల మల్లేశం అన్నారు. వెంకటేశ్వరనగర్‌లోని సత్‌జ్ఞాన్ హైస్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు శుక్రవారం వారి జూన్ నెల అటెండెన్స్, క్లీన్ యూనిఫామ్, చేతిరాతలను పరిగణనలోకి తీసుకుని ప్రశంస పత్రాలు అందజేశారు. మొత్తం 487 మంది విద్యార్థులు వంద శాతం హాజరై స్టార్ ఆఫ్ జూన్ మంత్‌గా నిలిచారన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు



దుండిగల్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ గణనీయంగా పెరుగుతోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికై రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రేవంత్‌రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని రేవంత్‌రెడ్డి భూపతిరెడ్డికి సూచించారు.

మేయర్ నీలారెడ్డికి ఆహ్వానం



నిజాంపేట్: నాణ్యమైన విద్య అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేలా ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు కృషి చేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. ప్రగతినగర్‌లోని స్ఫూర్తి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, కరస్పాండెంట్ రామారావులు శుక్రవారం మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 8న ప్రగతినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న ప్రజ్ఞా ప్లే స్కూల్ అకాడమీ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా కోరుతూ మేయర్ నీలారెడ్డిని ఆహ్వాన పత్రికను అందజేశారు.

దోమల నియంత్రణకు అమెరికా సంస్థతో కలిసి పరిశోధన

లాలాపేట: దోమల వల్ల కలిగే వ్యాధుల భారాన్ని తగ్గించి మానవాళికి దోమల బెడద నుంచి విముక్తి కల్గించే దిశగా తమ పరిశోధనలు జరుగుతున్నాయని ఓయూ జంతుశాస్త్ర అధ్యాపకులు, ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యానాయక్ తెలిపారు. ఈ మేరకు ఈయన గత కొంత కాలంగా దోమల నియంత్రణ, వెక్టర్ ద్వారా సంక్రమించే వ్యాధులపై అమెరికాలోని ఫ్లోరిడా సెయింట్ ఆగస్టీన్ పరిశోధన కేంద్రంతో కలిసి పరిశోధనలు చేస్తున్నారు. అనస్తీసియా దోమల నియంత్రణ ప్రాంతంలో మూడు నెలల పాటు ఇతర శాస్త్రవేత్తలతో కలిసి ప్రొ. రెడ్యానాయక్ పరిశోధనలు చేస్తున్నారు.

దేశంలో 50వేల కోట్ల టర్నోవర్‌తో అట్టడబ్బాల పరిశ్రమ

సనత్‌నగర్: భారతదేశంలో కర్రుగేటెడ్ (అట్టడబ్బా ల) పరిశ్రమ ఏడాదికి రూ.50వేల కోట్ల వ్యాపా రం కొనసాగుతుందని, అది తెలంగాణలో సుమారు రూ.2500 కోట్లు ఉంటుందని ఇంటర్నేషనల్ కర్రుగేటెడ్ కేస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ ఎంఎల్ అగర్వాల్ అన్నారు. హోటల్ కాకతీయలో రెండు రోజుల పాటు జరుగనున్న కర్రూపాక్ సమ్మిట్–2023 శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ సమావేశం అట్టడబ్బాల తయారీదారుల చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయి అని ఇక్కడే 2027లో జరుగబోయే అంతర్జాతీయ సమ్మిట్‌కు సంబంధించిన ఏర్పాట్లు ఖరారవుతాయని చెప్పారు. ఇది ద్వైవార్షిక సమావేశమని దీనిలో ప్రపంచ వ్యాప్తంగా ఉండే నిపుణులందరూ ఉమ్మడి ప్రయోజనాల కోసం సమావేశం అవుతారని చెప్పారు.

సత్యాన్ని, ధర్మాన్ని నమ్ముకోవాలి

లాలాపేట: సత్యాన్ని, ధర్మాన్ని, న్యాయాన్ని నమ్ముకుంటే ప్రతి న్యాయ విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదుగుతారని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ ఎస్ నరసింహ అన్నారు. శుక్రవారం ఓయూ లా కళాశాల డీన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో అరోరా న్యాయ కళాశాల విద్యార్థులు సుప్రీం కోర్టును సందర్శించారు. ఇందులో భాగంగా జస్టిస్ ఏ ఎస్ నరసింహను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు.

జీఓ.. జీనేదో!

'ముందు నుయ్యి.. వెనుక గొయ్యి' ఇదీ జీఓ.59 దరఖాస్తుదారుల పరిస్థితి

జియో.. జీనేదో అంటే బతుకు.. బతకనివ్వు అని అర్థం. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టుకుని ఉంటున్న వారి కోసం ప్రభుత్వం తీసుకోచ్చిన జీఓ.59 వారిని బతకనిస్తుందని అనుకున్నారు. చాలా మంది సంతోషించి జీఓ.59కు దరఖాస్తు చేసుకున్నారు. కానీ సీన్ రివర్స్ అయ్యింది. 2022 గణాంకాల ప్రకారం పెరిగిన భూముల ధరలకు అనుగుణంగా డబ్బులు చెల్లించాలని అధికారులు డిమాండ్ నోటీసులు పంపించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ జీఓ తమకు బతుకునిస్తుందనుకుంటే ఇలా అధిక డబ్బులు చెల్లించాలని ఒత్తిడికి గురిచేస్తూ బతకనివ్వడం లేదని విలపిస్తున్నారు. ప్రభుత్వ జీఓలు పేదలను రక్షించేలా ఉండాలి కానీ ఇలా రోడ్డుపాలు చేసేలా ఉండొద్దని పలువురు అంటున్నారు.

- ఆందోళనలో జీఓ.59 దరఖాస్తుదారులు
- డిమాండ్ నోటీసులో పేర్కొన్న ధరలు చెల్లించలేక తిప్పలు
- అంత డబ్బు ఎక్కడి నుంచి తెచ్చి కట్టాలని ఆవేదన
- అధికారులను వేడుకుంటున్న ఆగని కూల్చివేతలు

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం మురికివాడ ప్రాంతాలు, ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా వెలసిన నిర్మాణాలను క్రమబద్ధీకరించుకునేందుకు జీఓ.58, 59ను తీసుకొచ్చింది. దీనిపై విస్తృత ప్రచారం సైతం చేసింది. దీంతో ప్రభుత్వ స్థలాల్లో ఉంటున్న వారు దరఖాస్తు చేసుకున్నారు. జీఓ.58 కింద కొంత మందికి పట్టాలు అందజేసి జీఓ.59 కింద దరఖాస్తు చేసుకున్న వారిపై అధికారులు కఠినంగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం జీఓ.59 కింద దరఖాస్తు చేసుకున్న వారి పరిస్థితి 'ముందు నుయ్యి.. వెనుక గొయ్యి'అన్న చందంగా మారింది.

◆ ఒకవైపు డబ్బులు చెల్లించకపోతే ఇళ్లు కూల్చివేస్తామని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తుంటే.. డిమాండ్ నోటీసు మేరకు డబ్బులు మేము కట్టలేమంటూ దరఖాస్తుదారులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం మాత్రం దరఖాస్తు చేసుకున్న వారి నుంచి విధిగా డబ్బులు వసూలు చేయాలని హుకుం జారీ చేసింది. దీంతో సంబంధిత అధికారులు ఆస్తుల జప్తు, ఇళ్ల కూల్చివేత చేపడుతున్నారు. మొన్న బాచుపల్లిలో.. నిన్న దుండిగల్ మండల పరిధిలో కుల్చివేతల పర్వం కొనసాగించడం ఆందోళన కలిగిస్తున్న విషయం.

◆ గడిచిన రెండు నెలల్లో వివిధ కాలనీలో రెవెన్యూ అధికారులు లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి పెరిగిన నోటీసు విషయంపై చర్చించారు. ఈ నేపథ్యంలో విశ్వకర్మకాలనీలో ప్రభుత్వ ప్రతినిధిగా ఈ విషయంపై విచారణ చేపట్టేందుకు నవీన్ మిట్టల్ రంగ ప్రవేశం చేసి స్థానికుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అయినప్పటికీ 2014 నిబంధన ప్రకారం అప్పట్లో భూముల ధరలు ఒక విధంగా ఉన్నాయి.

◆ తాజాగా 2022 గణాంకాల ప్రకారం భూముల ధరలు విపరీతంగా పెరగడంతో తాజాగా దరఖాస్తు చేసుకున్న జీఓ.59 లబ్ధిదారులకు భారీగా డబ్బులు చెల్లించాలని నోటీసులు రావడంతో దిక్కుతోచని స్థితి ఉన్నారు. సంవత్సర కాలంగా ఈ విషయం డైలమాలో ఉన్న లబ్ధిదారులకు అధికారుల నుంచి తీవ్ర ఒత్తిళ్లు రావడంతో చేతులెత్తేశారు. తాజాగా కూల్చివేతల కొనసాగిస్తుండటంతో ఏమి చేయాలో అర్థం కాక బిక్కుబిక్కుమని జీవిస్తున్నారు.





◆ బాచుపల్లి మండలంలో మొత్తం జీఓ.59 కింద 816 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 400 పైగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తయ్యింది. మరో 400 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక్కడ అత్యధిక శాతం మురికివాడ ప్రాంతాల్లోనే ఉంటున్న వారికి లక్షల్లో చెల్లించాలంటూ డిమాండ్ నోటీసు రావడం విశేషం.

◆ దుండిగల్ మండల పరిధిలో మొత్తం 485 దరఖాస్తులు రావడంతో 329 మందికి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేశారు. 156 పెండింగ్లో ఉండగా వాటిని గుర్తించి రెవెన్యూ అధికారులు శుక్రవారం నుంచి ఆయా ప్రాంతాల్లో కూల్చివేతలు చేపట్టడం విమర్శలకు తావిస్తోంది.

◆ కుత్బుల్లాపూర్ మండల పరిధిలో జీవో నం.59 కింద 14,518 మంది దరఖాస్తు చేసుకున్నారు. 4032 మందిని లబ్ధిదారులను గుర్తించి వారికి డిమాండ్ నోటీసు పంపించారు. కేవలం 950 మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మిగిలిన 3082 మంది రిజిస్ట్రేషన్‌కు దూరంగా ఉండటంతో ప్రభుత్వ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు పంజా విసిరేందుకు సిద్ధమయ్యారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలో జరిగిన వేడుకల్లో దళిత సంఘాల నాయకులు

కుత్బుల్లాపూర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధించేందుకు ఎమ్మార్పీఎస్ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని జిల్లా నాయకుడు సిలువేరు శ్రీనివాస్‌మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలో జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. అంటరాని వారిగా ఉన్న మాదిగలు నేడు పోరాటం చేసే స్థాయికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ తీసుకువచ్చారని, ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి ఎస్సీ వర్గీకరణను సాధించి తీరుతామన్నారు. అదే విధంగా మందకృష్ణ మాదిగ 59వ జన్మదిన పురస్కరించుకొని స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మాదిగ, రమేష్ మాదిగ, రవి మాదిగ, దళిత నాయకులు సిద్ధయ్య, జెస్సీ పాల్, నరసింహులు, జానయ్య, భూమయ్య, విజయ్,ఎస్తేరు రాణి, మహేశ్వరి, సలోమి పుష్ప, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సేవలు సద్వినియోగం చేసుకోవాలి



చిన్నారులతో అక్షరాభాస్యం చేయిస్తున్న కార్పొరేటర్ కాసాని సుధాకర్

నిజాంపేట్: అంగన్‌వాడీ కేంద్రాల అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నిజాంపేట్ కార్పొరేషన్ 19వ డివిజన్ కార్పొరేటర్ కాసాని సుధాకర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం బాచుపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభాస్యం, అన్నప్రాసన చేయించారు. ఈ సందర్భంగా సుధాకర్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహారంతో పాటు మందులను ఉచితంగా అందజేస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీఆర్ఎస్ నాయకుడలు కమ్మెట భూపాల్, వాసు, నందిగామ మహేష్ , అంగన్‌వాడీ టీచర్ మనిమల, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

'రాజకీయ కుట్రతోనే పిటిషన్ తిరస్కరించారు'

దుండిగల్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అనర్హత వేటుపై స్టే విధించడం కోసం వేసిన పిటిషన్‌ను గుజరాత్ హైకోర్టు విచారణ స్వీకరించకపోవడంలో రాజకీయ కుట్ర దాగి ఉందని దుండిగల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మద్దికుంట నవీన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు పిటిషన్ తిరస్కరణను నిరసిస్తు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంతో శుక్రవారం గండిమైసమ్మ చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోది దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో కాంగ్రెస్ పార్టీకి, రాహుల్‌గాంధీకి లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమన్నారు.

హాస్పిటల్ ఏర్పాటు చేసే వరకు ఆందోళన చేస్తాం

లాలాపేట: చేయి చేయి కలుపుదాం భవిష్యత్ తరానికి హాస్పిటల్ నిర్మిద్దామంటూ ఓయూ మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 95వ రోజుకు చేరాయి. శుక్రవారం నాటి దీక్షలను కాంగ్రెస్ నాయకులు ఆలకుంట లింగయ్య, వేముల శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు ఓర్సు కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరం నడిబొడ్డున ప్రాథమిక ఆరోగ్యం ఏర్పాటు చేయాలనీ కోరుతూ గత 95 రోజులుగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు. అయినా సరే హాస్పిటల్ ఏర్పాటు అయ్యేదాక తమ ఆందోళన విరమించేది లేదన్నారు.

డివిజన్‌ను అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నాం



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి

నిజాంపేట్: మెరుగైన వసతులు కల్పిస్తూ డివిజన్‌ను అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయిఅనురాగ్ కాలనీలో రోడ్డు నంబరు 1, 1–బి, 12–బిలలో రూ.40 లక్షలతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పాధాన్యత క్రమంగా ప్రతి కాలనీ, బస్తీలో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు మొదలగు సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జనార్దన్, కిరణ్, శంకర్‌రావు, శ్యామ్, శ్రీనివాస్, సెబాస్టియన్, పాపారావు, ఫణి, యలమందా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యం

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీతోనే బంగారు తెలంగాణ సాధ్యమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ అయోధ్యనగర్‌కు చెందిన మహిళలు శుక్రవారం నాగ భవానీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా హన్మంతరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మ్టాలాడుతూ.. మహిళల అభ్యున్నతికి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సారథ్యంలో అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని కొనసాగిస్తామన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్ ముదిరాజ్, బేకు శ్రీనివాస్, నర్సింగ్, కిరణ్, పాషా, శివ, మోహన్, మహిళ కాంగ్రెస్ నాయకులు విజయలక్ష్మి, రేవతి తదితరులు పాల్గొన్నారు.



హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మహిళలు

ఉమ్మడి పౌర స్మృతి సదస్సును విజయవంతం చేయాలి

లాలాపేట: ఓయూ ఆర్ట్స్ కళాశాల న్యూ సెమినార్ హాల్లో ఈనెల 10న ఉదయం 11గంటలకు నిర్వహించతలపెట్టిన ఉమ్మడి పౌర స్మృతి సదస్సును విజయవంతం చేయాలనీ ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి రవినాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఓయూ పాలనా భవనం ఎదుట ప్రొఫెసర్ అన్సారీ ఆందోళన

లాలాపేట: రిటైర్మెంట్ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయడంతో పాటు సర్వీసు బెనిఫిట్స్‌ను ఇవ్వాలని కోరుతూ గత రెండు రోజుల నుంచి ప్రొఫెసర్ అన్సారీ ఓయూ పాలనా భవనం ఎదుట ఆందోళన చేస్తున్నారు. ఈ మేరకు రెండవ రోజు శుక్రవారం అన్సారి ఆందోళనకు ఓయూ ఉద్యోగ సంఘాలు, విద్యార్థి సంఘాలు మద్దతు తెలిపాయి.

పోకిరీలకు అడ్డాగా 'డబుల్' ఇళ్ల సముదాయం



సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్ నగర్‌లో ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ సముదాయం పోకిరీలకు అడ్డగా మారింది. తాగిన మత్తులో సముదాయానికి చెందిన లక్షలు విలువ చేసే అద్దాలు, డోర్లు, కిటికీలను ధ్వంసం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని స్థానికులు కోరుతున్నారు.



దేవేందర్‌నగర్‌లోని డబుల్ ఇళ్ల కిటికీ అద్దాలు ధ్వంసం చేసిన పోకిరీలు

ఆకట్టుకున్న సంచార వైజ్ఞానిక ప్రదర్శన



ఇస్రో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంచార వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు..



స్పేస్ ప్రోగ్రామ్‌లపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రవికుమార్

నిజాంపేట్: ఇస్రో సంస్థ అభివృద్ధి చేసిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో నేడు సామాన్య ప్రజలు సైతం ఆన్‌లైన్ సేవలను వినియోగించుకుంటున్నారని ఎన్ఆర్ఎస్‌సీ, ఇస్రో సంస్థ డిప్యూటీ సంచాలకులు డాక్టర్ ఎంవీ రవికుమార్ అన్నారు. బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఆధ్వర్యంలో విద్యార్థులకు భారతదేశ అంతరిక్ష కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పేస్ ఆన్ వీల్స్ పేరిట బస్సులో ఇస్రో సంస్థ ఏర్పాటు చేసిన సంచార వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది.

◆ ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన డాక్టర్ రవికుమార్, డాక్టర్ ఆర్.శ్రీనివాస్, డాక్టర్ పి.హరీశ్, డాక్టర్ మంజూశ్రీ, ఎన్.సవిత మాట్లాడుతూ.. ఇస్రో అభివృద్ధి పరిచిన భువన్ జియోస్పేషియేట్ ద్వారా రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. జీడిమెట్లలోని ఎన్ఆర్ఎస్‌సీ ప్రాంగణంలో నవకల్పన, అంకుర సంస్థలకు ప్రాధాన్యత ఇస్తున్నామని... అందుబాటులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని విద్యార్థులు అంకుర సంస్థలను ఏర్పాటు చేసుకుని జీవితాలను మలచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీడీ నాయుడు, సంచాలకులు డాక్టర్ చెన్నకేశవరావు, విద్యార్థి పురోగతి ఆచార్య డాక్టర్ పద్మశాయి, సీఈఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ నాగిని, కళాశాల అనుబంధ అధ్యాపకుడు డాక్టర్ రవి సదాశివుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటికీ బీజేపీ



జేకేనగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

జీడిమెట్ల: బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల ఇబ్బందులను తొలగిస్తామని రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి అన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన సుభాష్‌నగర్ డివిజన్‌లోని జేకేనగర్, కృష్ణమూర్తినగర్, సాయివెంకట అవెన్యూ కాలనీలలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు ఆయా కాలనీలలో పాదయాత్ర నిర్వహించారు. తమ కాలనీల్లో నాలా సమస్య ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. నాలాకు ఆనుకుని ఉన్న పరిశ్రమల నుంచి వ్యర్థాలు నాలాలో డంప్ చేస్తుండటంతో దుర్వాసన వస్తుందన్నారు.

దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి
నీటి కనెక్షన్లు ఇవ్వాలి

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



జలమండలి అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని భౌరంపేట్, బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీల్లో బల్క్ తాగునీటి కనెక్షన్ల విషయమై ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ శుక్రవారం జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా మంచినీటి కనెక్షన్లు మంజూరు చేయాలని జలమండలి ఎండీ దానకిషోర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఒప్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నీటి కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి కనెక్షన్లు ఇవ్వాలన్నారు. 10రోజుల్లో నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సూరారం నుంచి బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీకి 1.5 ఎంఎల్‌డీ, నిజాంపేట్ నుంచి 2 ఎంఎండీల నీటిని భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీకి కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ సత్యనారాయణ, జలమండలి జీఎంలు సంతోష్, శ్రీధర్‌రెడ్డి, కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మురళియాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ డివిజన్ ప్రగతియాత్ర

గత ప్రభుత్వాల హయాంలో ఎన్నడూ జరగని అభివృద్ధి తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా శుక్రవారం కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్, రామకృష్ణనగర్‌లలో ఆయన మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్‌తో కలిసి పర్యటించారు. స్థానికంగా అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు సహకరించిన ఎమ్మెల్యేకు కాలనీ ప్రజలు ఘన స్వాగతం పలికి శాలువతో సత్కరించారు.

◆ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలతో పాటు కుత్బుల్లాపూర్‌కు వైద్య కళాశాలను కేటాయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈ పాపమ్మ, మాజీ కౌన్సిలర్లు కిషన్ రావు, సూర్యప్రభ, స్థానిక డివిజన్ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్‌చారి, బాలయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేణుకాఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

◆ జీడిమెట్ల డివిజన్ పరిధి జయరామ్‌నగర్‌లోని శ్రీరేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా ప్రారంభం

◆ గాజులరామారం డివిజన్ జెసింట గార్డెన్స్ మిషన్ భగీరథ పథకంలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీటి సౌకర్యాన్ని ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కొత్తగా ఏర్పాటైన కాలనీలు, బస్తీల్లో సైతం ప్రజావసరాలు తెలుసుకుని అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. వాటర్‌వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి, డీజీఎం అప్పల నాయుడు, మేనేజర్ రోహిణి తదితరులు పాల్గొన్నారు.